ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★ సోమవారం 26 ఆగస్టు 2024



డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ 8లో..

శిథిలావస్థలో వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8లో..





కనగర్తిలో ఇంటి పన్ను అందిస్తున్న కారోబార్ అశోక్(ఫైల్)

కారోబార్ల వెట్టిచాకిరీ..

- చాలీచాలని వేతనాలతో అవస్థలు
- పనికి తగ్గ వేతనాలు కరువు
- ప్రత్యేక గుర్తింపునివ్వాలని వేడుకోలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 25 : గ్రామపంచాయతీ పాలనలో కారోబార్ల పాత్ర అత్యంత కీలకమైనది. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా కారోబార్ల జీవితాల్లో వెలుగులు మాత్రం రావడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా వారి బతుకులు మారడం లేదు. చాలిచాలనీ జీతాలతో పనిభారం ఎక్కువవుతున్నా భరిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రధానంగా మురుగు కాలువలు శుభ్రం చేయించడం, చెత్త సేకరించడం, తాగునీటి సరఫరా, దండోరా వేయించి ప్రజలకు సమాచారం అందించడం, గ్రామపంచాయతీ కార్యాలయ నిర్వహణ వంటి ఎన్నో పనులు చేపట్టడంలో కారోబార్‌లే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. గత కొన్ని ఏళ్లుగా పంచాయతీల్లో కారోబార్‌లుగా విధులు నిర్వహిస్తున్నా ఇప్పటికి తమను పట్టించుకున్న ప్రభుత్వాలు లేవని వాపోతున్నారు. అప్పట్లో గ్రామ పంచాయతీలను బట్టి రూ.200 నుంచి మొదలుకొని రూ.2500 వరకు వేతనాలతో పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కారోబార్‌లకు జీతం రూ.9500 మాత్రమే చెల్లిస్తున్నారు.

● మల్టీపర్పస్ మాదిరిగా సీనియర్‌లకు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి కారోబార్లను మల్టీపర్పస్ వర్కర్‌లుగా పేరు మార్చి వారిని అన్ని పనులకు వినియోగించింది. గతంలో పెద్దపల్లి మండలంలో 29 గ్రామపంచాయతీలుగా బందపల్లి, చందపల్లి, రంగపల్లిలకు పెద్దపల్లి మున్సిపాలిటీలో కలిపి అదనంగా గోపయ్యపల్లి, దేవునిపల్లి, నిమ్మనపల్లి, కుర్మపల్లిలను నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అయిలే కొత్త గ్రామ పంచాయతీల్లో కొందరిని మల్టీపర్పస్ వర్కర్‌లుగా తాత్కాలికంగా నియమకాలు చేశారు. కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న కారోబార్‌లకు, నూతన విధానంతో తీసుకున్న మల్టీపర్పస్ వర్కర్‌లకు ఒకే మాదిరిగా వేతనాలు చెల్లిస్తోంది.

● ప్రత్యేక గుర్తింపు కరువు..

గ్రామ పంచాయతీల్లో కీలకంగా పనిచేస్తున్న తమకు ప్రత్యేక గుర్తింపునిస్తూ గౌరవవేతనాన్ని పెంచాలని కారోబార్లు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతున్నారు. గ్రామాల్లో 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్న తమను ప్రభుత్వం గుర్తించి, వేతనం పెంచి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

● ఉపాధి కూలీలకంటే తక్కువ..

ఉపాధిహమీ పనులు చేసే కూలీల కంటే తక్కువ వేతనాలు కారోబార్లకు అందుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శి తరువాత అన్ని విధాలుగా పనిచేస్తున్న కరోబార్లకు కనీస వేతనం రూ.9500గానే ఉంది. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నా తమకు కనీసం ఉపాధి కూలీలకు అందించే కూలీ కూడా ఇవ్వకపోవడం బాధాకరమని కారోబార్లు వాపోతున్నారు. నూతనంగా కార్మికులుగా చేరిన వారికి కూడా ఇదే జీతాన్ని అందిస్తున్నారని, ఏళ్ల తరబడి వెట్టిచాకిరీ చేసినా ప్రత్యేక గుర్తింపు లేకపోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

20 ఏళ్లుగా కారోబార్‌గా పనిచేస్తున్నా..

- కల్వల రాజమౌళి, పెద్దకల్వల కారోబార్



పెద్దకల్వల గ్రామ పంచాయతీలో 20 ఏళ్లుగా గ్రామ పంచాయతీ కారోబార్‌గా పనిచేస్తున్నా. అప్పట్లో రూ.500 ఇచ్చేవారు కొన్నాళ్ల తరువాత రూ.3000వేలు ఇచ్చారు. ప్రస్తుతం మేనెల నుంచి రూ.9500 జీతం ఇస్తున్నారు. ఏళ్లతరబడి పనిచేస్తున్నా చిన్నచూపు చూడటం బాధగా ఉంది. సర్వీస్‌ను చూసి జీతం చెల్లిస్తే కుటుంబ పోషణ భారం తగ్గుతుంది.

సీనియారిటీ ద్వారా వేతనాలు చెల్లించాలి..

- కుడిక్యాల రాజయ్య, హన్మంతునిపేట కారోబార్



గ్రామ పంచాయతీల్లో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కారోబార్‌లకు సీనియారిటీల ప్రకారం గౌరవ వేతనం చెల్లించాలి. పంచాయతీ కార్యదర్శుల తరువాత కష్టపడే మమ్మల్ని ప్రభుత్వం గుర్తించాలి. నిరుపేద కుటుంబాలకు చెందినవారే అధికంగా కారోబార్లు విధులు నిర్వహిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం కారోబార్లకు ఖచ్చితమైన వేతనం అందించాలి.

రామగుండం ఎన్టీపీసీకి ఐదు జాతీయస్థాయి పురస్కారాలు



అవార్డులు అందుకుంటున్న ఎన్టీపీసీ అధికారులు

జ్యోతినగర్, ఆగస్టు 25 : రామగుండం ఎన్టీపీసీకి ఐదు జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయి. ప్రముఖ టస్కర్ అనే సంస్థ ప్రతి ఏటా ప్రభుత్వరంగ కంపెనీల్లో అత్యుత్తమంగా పనిచేసే విభాగాలకు జాతీయ స్థాయి అవార్డులను అందజేస్తున్నది. దీనిలో భాగంగా 2024 సంవత్సరానికి రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టుకు 5 విభాగాలలో మూడు గోల్డ్, 2బ్రాంజ్ అవార్డులను టస్కర్ నేషనల్ అవార్డుల పేరిట ప్రకటించింది. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం(రూరల్ స్పోర్ట్స్ ప్రమోషన్)తో పాటు సామాజిక చిత్రం(యాడ్‌ఫిల్మ్), మానవ వనరుల విభాగంలో వైవిధ్యం అనే మూడు అంశాలకు గోల్డ్ అవార్డులు వచ్చాయి. అలాగే మానవ వనుల సద్వినియోగం, అవగాహన కల్పించడం, సీఎస్‌ఆర్‌లో రెండు బ్రాంజ్ అవార్డులు రామగుండం ఎన్టీపీసీకి దక్కాయి. ఈ మేరకు శనివారం రాత్రి కేరళలోని కోజికోడ్(కాలికట్)లో జరిగిన టస్కర్ నేషనల్ అవార్డుల కార్యక్రమంలో ఎన్టీపీసీ హెచ్‌ఆర్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్ విభాగాల అధికారులు ప్రజ్ఞాన్ ప్రియదర్శిని, రూపాలి రంజన్‌లకు కేరళ మంత్రి పీఏ మహమ్మద్ రియాస్ అవార్డులను ప్రదానం చేశారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 23,091 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 419 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 16.967 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

ఆదివరాహ స్వామి క్షేత్రంలో భక్తుల సందడి



ఆలయంలో భక్తుల పూజలు

కమాన్‌పూర్, ఆగస్టు 25 : మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు శ్రావణమాసంలో స్వామివారి దర్శనం కోసం తరలివచ్చారు. ఈ నేపథ్యంలో రోజువారికంటే ఆదివారం సెలవుదినం కావడంతో పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా భక్తులు వచ్చారు.

డీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 25 : కోల్‌కతా మెడికల్ పీజీ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రాజ్‌కుమార్, దశరథం, ప్రతాప్‌చారి, సదానందం, జితేందర్ రెడ్డి, ప్రకాష్‌రావు, సత్యనారాయణరెడ్డి, సుభాని, స్వామి పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా ప్రభాకర్



ప్రభాకర్‌ను అభినందిస్తున్న సంఘం నేతలు

మంథని, ఆగస్టు 25: జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మంథనికి చెందిన నలుమాచు ప్రభాకర్ ఆదివారం పెద్దపల్లిలో జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభాకర్ ఎన్నికపై కాంగ్రెస్ నేతలు ఇనుముల సతీష్, రావికంటి సతీష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

సుల్తానాబాద్ మినీ స్టేడియం అభివృద్ధికి కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఆగస్టు 25 : సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండేయ కాలనీలోగల మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఖోఖో శిబిరాన్ని ఆదివారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు టీ షర్టులు, క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, మూడునాలుగు దశాబ్దాలుగా సుల్తానాబాద్ పట్టణం క్రీడలకు పుట్టినిల్లుగా విరజిల్లుతోందని అన్నారు. ఎంతోమంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి సుల్తానాబాద్ పేరును దశదిశలా ఖ్యాతిని పెంచారని గుర్తుచేశారు. ఇదే పరంపర కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మినీ స్టేడియం ఫంక్షనింగ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని, తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.3 లక్షల వరకు నిధులు కేటాయించడం జరుగుతుందని క్రీడాకారుల హర్షధ్వానాల మధ్య ఆయన ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఆసియా, కామన్వెల్ గేమ్స్‌లో తెలంగాణ సత్తా చాటేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. క్రీడాకారులు గ్రామీణ క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. డీవైఎస్‌వో సురేష్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు, వైస్‌ఛైర్‌పర్సన్ బిరుదు సమతాకృష్ణ, సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు ఎం. రవీందర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే విజయరమణారావు

'ధరణి'లో నమోదయ్యేదెప్పుడో?

- ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమవుతున్న రైతులు
- ఐదేళ్లుగా మొరపెట్టుకుంటున్నా ఫలితం శూన్యం

కమాన్‌పూర్, ఆగస్టు 25 : మండలంలోని లింగాల శివారులో కొందరు నిరుపేద రైతులకు 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భూమి పంపిణీ చేశారు. రెక్కలు ముక్కలు చేసుకొని భూమిలోని బండరాళ్లను తొలగించి సాగుచేసుకుంటున్నారు. అయితే గత ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన 'ధరణి'తో ఇన్నాళ్ల తాము సాగు చేసుకుంటున్న భూమిపై ఎలాంటి లీగల్ అధికారాలు లేకుండా పోయాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకరావడంతో ఇక్కడి రైతులకు సమస్య ఏర్పడింది. ఆన్‌లైన్‌లోకి సాగు భూమి వివరాలు నమోదు కాకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలను పొందలేక పోతున్నామని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరణిలో నమోదు కాని వివరాలు..

కమాన్‌పూర్ మండలంలోని లింగాల గ్రామ శివారులోని సర్వే నంబరు 68-103 వరకు 108 ఎకరాల భూమిని 75 మంది నిరుపేద రైతులకు 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. అప్పటి నుంచి భూమిని సాగు చేసుకుంటున్న రైతుల వివరాలు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2019లో అమల్లోకి తెచ్చిన 'ధరణి' పోర్టల్ నమోదు చేయలేదు. దీంతో రైతుల పరిస్థితి అగమ్యగోచారంగా మారింది. ఈ భూమికి సంబంధించిన పాత పట్టాదారు పాసుబుక్ వివరాలు ఉన్నప్పటికీ, ధరణి పోర్టల్‌లో నమోదైన వివరాల ఆధారంగా ప్రభుత్వం రైతులకు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తోంది. దీంతో ఈ భూమిపై ఆధారపడిన రైతులు ధరణి పోర్టల్‌లో వివరాలు నమోదు కాకపోవడంతో ప్రభుత్వ ఫలాలకు దూరమవుతున్నారు.



రైతులు సాగు చేసిన వరి పంట

పట్టించుకోని అధికార యంత్రాంగం..

గత ముప్పై ఏళ్లుగా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉండి, తాము సాగు చేసుకుంటున్న భూమి వివరాలను ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలంటూ ఐదేళ్లుగా రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో కొన్నిసార్లు రెవెన్యూ అధికారులు సర్వేలు జరిపి చేతులు దలుపుకున్నారే తప్ప సమస్యకు పరిష్కారం చూపలేదు. గత ప్రభుత్వం ప్రకటించిన రైతు బీమా పథకం సైతం వర్తించకపోవడంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని శాలపల్లె, రొంపికుంట, తెనుగుపల్లె, నాగారం, కమాన్‌పూర్, ఎల్కపల్లి గ్రామాలకు చెందిన రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నారు.



పాత పట్టాదారు పాసుబుక్‌లను చూపుతున్న రైతులు

నా దృష్టికి రాలేదు..

- ఆరిఫొద్దీన్, తహసీల్దార్

వ్యవసాయ భూమికి సంబంధించిన సమస్యను రైతులు నా దృష్టికి తీసుకరాలేదు. సమస్యను నా దృష్టికి తీసుకొస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తా.

మౌలిక వసతులు కల్పించండి : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 25: రామగుండం కార్పొరేషన్‌లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సింగరేణి, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో జూమ్ మీటింగ్‌ను నిర్వహించారు. కార్పొరేషన్‌లో రోడ్లు,డ్రైనేజీలు, విద్యుత్ లైట్లు, మంచినీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, చాలా చోట్ల వీధి దీపాలు వెలగడం లేదని, దీనిపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని ఏరియాల్లో రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, టెండర్లు అయిన వర్క్‌లను త్వరితగతిన పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు. సింగరేణిలోని పలు ఏరియాల్లో, ముఖ్యంగా సింగరేణి క్వార్టర్స్ ఏరియాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం లేదని, దీనిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, సింగరేణి అధికారులు చెత్త తొలగింపును వేగవంతం చేయాలని సూచించారు. ఖబరస్థాన్‌లో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే పూర్తిచేయాలని సింగరేణి అధికారులను ఆదేశించారు.

అర్హులైన పేద వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల జాబితాను సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌జీ-1, 2 జీఎంలు లలిత్ కుమార్, సూర్యనారాయణ, కమిషనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.



పెద్దగుట్టపై ఘనంగా వరదపాశం

బీర్‌పూర్, ఆగస్టు 25: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆల య సమీపంలోని పెద్దగుట్టపైన ఆదివారం వరద పాశం కార్యక్రమాన్ని అత్యం త వైభవంగా నిర్వహించారు. పెద్దగుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో స్వామి వారికి ప్రత్యేక పూజ లు, అభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగం గా ఆదివారం బీర్‌పూర్ గ్రామంలోని నాయకులు, రైతులు, అర్చకులు ఆయా గ్రామాల ప్రజలు గ్రామ శివారులోని పెద్దగుట్ట వద్దకు కాలినడకతో చేరుకొ ని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేకమైన వేద మంత్రోచ్ఛారణలతో ఆయా రకాల తీపి, పిండి పదార్థలతో తయారు చేసిన పాశాన్ని పెద్దగుట్టపై పోసి వర్షాలు ఎక్కుగా కురిసి వరదలు పారేలా చూడు స్వామి అంటూ మొక్కులు చెల్లించు కున్నారు. వరదపాశం నిర్వహణకు, అన్న దానం కార్యక్రమాలకు పలువురు దాతలు తమ వంతుగా ఆర్థిక సహాయ సహకారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్ద సంతోష్, మధుకుమార్, చిన్న సంతోష్ కుమార్, ఆయా గ్రామాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.


వరద పాశం నిర్వహిస్తున్న వేదపండితులు













ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం మీద పడి వ్యక్తి మృతి


బైక్ మీద పడి మృతి చెందిన గంగాధర్

కథలాపూర్, ఆగస్టు 25 : మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన గండి గంగాధర్ (50) అనే వ్యక్తిపై ద్విచక్రవాహనం మీదపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై నవీన్, గ్రామస్థుల కథనం ప్రకారం గంగాధర్ శుక్రవారం రాత్రి దుకాణానికి వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. గ్రామ శివారుల్లో శనివారం వెతకగా బైక్ మీదపడి మృతిచెంది ఉన్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

అంజన్న సేవలో రైల్వే ఏజీఎం


కొండగట్టులో ఏజీఎంకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

మల్యాల, ఆగస్టు 25: దక్షిణమధ్య రైల్వే ఏజీఎం ధనుంజయ్ ఆదివా రం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఏజీఎం కుటుంబసభ్యులకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్కరించగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఆల య పర్యవేక్షకులు గుండి హరిహరనాథ్ తదితరులు ఉన్నారు.

ఇంటింటా జ్వర సర్వే

● డెంగ్యూపై వైద్యశాఖ అప్రమత్తం


ఉల్లంపల్లిలో జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్య శాఖ సిబ్బంది

చిగురుమామిడి, ఆగస్టు 25: మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో వైద్యశాఖ సిబ్బంది ఆదివారం ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఉల్లంపల్లి గ్రామానికి చెందిన జనవేని రోహిత్ (10) అనే బాలుడికి డెంగ్యూ పాజిటివ్ వచ్చినట్లు జిల్లా వైద్యాధికారులు మండల కేంద్రంలోని అరోగ్య కేంద్రానికి ఆదివారం సమాచారం అందించారు. దీంతో వైద్య సిబ్బంది అప్రమత్తమై ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలోని అన్ని వార్డులను సందర్శించారు. ఆయా వార్డుల్లో ఉన్న నీటి నిల్వలను తొలం గించారు. ఇంటింటా సర్వే చేశారు. వారి వారి ఆరోగ్య పరిస్థితులను అడి గి తెలుసుకున్నారు. కొంత మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఒకరికి డెంగ్యూ వచ్చిందన్న సమాచారంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామంలో జ్వరాల బారిన ప్రజలు

గ్రామంలో వారం రోజుల నుంచి కొంత మంది తీవ్రమైన జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ దవాఖనాలకు వెళ్లినా ఫలితం లేకుండా పోతుతందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అందరికీ పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉల్లంపల్లి గ్రామానికి చెందిన జనవేని రోహిత్ అనే బాలునికి డెంగ్యూ వచ్చిందని జిల్లా అధికారులు అధార్ కార్డు ప్రకారం తమకు సమాచారం అందించారని ఏఎన్ఎం ధనలక్ష్మి తెలిపారు. అతను ప్రస్తుతం హుస్నాబా ద్‌లో ఉంటున్నాడని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన పనిలేదని వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఐఐటీ హైదరాబాద్‌ను సందర్శించిన విద్యార్థులు


హైద్రాబాద్‌లోని ఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులు

రామడుగు, ఆగస్టు 25 : మండల కేంద్రంలోని సరస్వతి హైస్కూల్ పాఠశాల విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా ఆదివారం హైద్రాబాద్‌లోని ఐఐటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఐఐటీ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెద్దిగారి మహేష్ ఐఐటీలోని వివిధ విభాగా లను వివరించారు. ఐఐటీలో జరిగే పరిశోధనల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

యూపీఎస్ పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం

● టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పవన్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 25: కేంద్ర ప్రభుత్వం శనివారం కేబినెట్ స మావేశంలో ప్రవేశపెట్టిన భాగస్వామ్య పెన్షన్ పథకం(సీపీఎస్) స్థానం లో, కొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)ను అమలు చేయాలనే నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని టీఎస్‌సీపీఎస్‌ఇయూ రాష్ట్ర ఉపా ధ్యక్షుడు పవన్ అన్నారు. 1970 సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ ప్రకారం ప్రభుత్వం ఉద్యోగికి ఇచ్చే 50శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూపీఎస్ అంటే ఏకీకృత పెన్షన్ స్కీం కాదని, యూ స్‌లెస్ పెన్షన్ స్కీంగా భావిస్తున్నామన్నారు.

ఆయన వెంట సంఘ బాధ్యులు గంగాధరి మహేష్, సతీష్, మహేష్ గౌడ్, శ్రీనివాస్, జనార్ధన్, సతీష్, శ్రీనివాస్, మహేష్, విజయ్, రాజేశం, శంకర్, రవి, రాము తదితరులున్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణే పరిష్కారమార్గం

సీపీఎస్ స్థానంలో ఏకీకృత పెన్షన్ పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చిన పెన్షన్ విధానంను తాము అంగీకరించబోమని టీఎస్ యూటీఎఫ్ ఉపా ధ్యాయ సంఘ బాధ్యులు తిరుక్కోవెల శ్యాంసుందర్, అంబటి భూమేశ్వర్ స్పష్టం చేశారు. 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన ఉద్యోగులకు 50శాతం పెన్షన్ గ్యారంటీ చేస్తున్నట్లు, సర్వీసులో మరణించిన కుటుం బాలకు 60శాతం ఫ్యామిలీ పెన్షన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ చందాతో కూడిన పెన్షన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోవడం విచారకరం అన్నారు. ఐచ్ఛికం అని పేర్కొనడంలోనే అసలు మోసం దాగుందన్నారు. ఒక్క రూపాయి చెల్లించకుండానే సర్వీసును బట్టి 50శాతం పెన్షన్ ఇచ్చే పాత పెన్షన్ విధానాన్నే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రాజెక్టుల నీటిమట్టం వివరాలు

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	31,202	3,822	80.5	53.620
ఎల్లంపల్లి	23,091	6,719	20.175	16.967
మిడ్ మానేరు	7,350	6,146	27.54	18.70
ఎల్ఎండీ	6,248	212	24.034	6.153

ప్రమాదవశాత్తు రైస్‌మిల్ కార్మికుడి మృతి

తిమ్మాపూర్, ఆగస్టు25: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల బాస్మతి రైస్ మిల్లు ప్లాట్ ఫాం వద్దన నిద్రిస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు వ్యాన్ తగిలి మృతి చెందాడు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌లోని బాస్మతి రైస్ మిల్లు లో కూలీగా పనిచేస్తున్న బీహార్‌లోని చంపారన్ జిల్లా, సిస్వబట్టంకి చెందిన కిషోర్ రాయ్(39) శనివారం అర్ధరాత్రి రైస్ మిల్లు ప్లాట్ ఫాంపై నిద్రిస్తున్నాడు. సూరజ్ అన్సారీ డ్రైవర్ తన వాహనాన్ని పార్కింగ్ చేసేందుకు రివర్స్ చేసే క్రమంలో ప్లాట్‌ఫాంపై నిద్రిస్తున్న కిషోర్ రాయ్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో కిషోర్ రాయ్‌కు తీవ్రంగా గాయాలు కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి వరద

ధర్మపురి, ఆగస్టు 25: ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఆదివారం పెరిగింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నిండిపోయిన చెరువులు, కుంటలు, వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. దీనికి తోడుగా కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టులోకి 6,506 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు సంబంధిత 3, 1వ నెంబర్ గేట్లు ఎత్తి దిగువ గోదావరి నదిలోకి 3,981 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. సాయంత్రం 5 గంటల వరకు గోదావరి నది నీటి ప్రవాహం వేగంగా కొనసాగుతోంది. దీంతో ప్రస్తుతం గోదావరి నది నీటి ప్రవాహం పెరిగి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎగువ వైపు ఉన్న సత్యవతి గుండం నుంచి దిగువ రాయపట్నం వైపు వరద ప్రవాహం వేగంగా కొనసాగుతోంది. ధర్మపురి వద్ద ఉసిరిక వాగు దాటి నీటి ప్రవాహం కొనసాగుతోంది. వాగు దాటి ఆటు వైపు భక్తులు స్నానాలు చేసేందుకు వెళ్లకుండా వరద ప్రవాహం పెరిగింది. చిన్న గద్దె నీటిలో మునిగిపోగా, మంచి నీటి బావి నీటిలో మునిగి పోయాయి. మంగళిగడ్డ, సోమవిహార్, మహాలక్ష్మి స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయాయి. గోదావరి నది తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, మగ్గిడి, జైనా, రాజారం, దమ్మన్నపేట, ధర్మపురి, తిమ్మాపూర్, బూరు గుపల్లి, రాయపట్నం గ్రామాలకు ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



ధర్మపురి వద్ద స్నానఘట్టాలు ఆనుకుని ప్రవహిస్తున్న గోదావరి

చికిత్స పొందుతూ మహిళ మృతి

మానకొండూర్, ఆగస్టు 25 : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన చుక్క లచ్చమ్మ (50)అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లచ్చమ్మ శనివారం తన పశువులకు మేత వేయడానికి గడ్డి వాము దగ్గరికి వెళ్లి దానిపై ఉన్న కవర్‌ను తీస్తుండగా విషపురుగు కాటు వేసింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిందని కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట రూరల్, ఆగస్టు 25: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేక పోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ ఓనర్ మల్లేష్, యాజమాని కమల్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు.

● వీణవంక: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా మానేరు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మానకొండూరు మండలం ఊటూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ సింగారపు వేణు ప్రసాద్, ఓనర్ సింగారపు రాజలింగంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

కొండగట్టులో పార్కింగ్ రుసుం వసూలు

● అంజన్న భక్తులకు కానున్న భారం ● అభిప్రాయాలు తెలుపాలంటున్న దేవస్థానం అధికారులు

మల్యాల, ఆగస్టు 25: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో కొండపైన వాహన పార్కింగ్ రుసుము వసూలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారు. దేవస్థానం కార్యాలయం ముందు గల ఖాళీ స్థలంలో ప్రస్తుతం వాహన పార్కింగ్ చేస్తున్నారు. భక్తుల రద్దీ సమయంలో వాహనాల పార్కింగ్‌కు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది.భక్తులు ఇబ్బందులు పడుతుండగా పార్కింగ్ సరిగా లేకపోవడంతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గంలో రహదారులపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. దేవస్థానం అధికారులు పార్కింగ్‌కు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయకపోవడం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా తాజాగా అధికారులు పార్కింగ్‌కు రుసుము వసూలు చేయాలని నిర్ణయించడం పట్ల భక్తుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వాహన పార్కింగ్‌కు సంబంధించి ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారో తెలుపకుండానే పార్కింగ్ రుసుము ప్రవేశపెట్టడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆరు చక్రాల వాహనాలైన బస్సు, లారీకి రూ.50. నాలుగు చక్రాల వాహనాలు కారు, జీపు రూ.40, ఆటోకు రూ.30, ద్విచక్రవాహనాలకు రూ.10గా వాహన రుసుమును అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రుసుము ప్రవేశపెట్టడంపై దేవస్థానం అధికారులు అభిప్రాయ సేకరణకు కలెక్టరేట్ వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద నోటీస్‌లు పెట్టారు. మెజారిటీ ప్రజలు, భక్తుల అభిప్రాయాలను అనుసరించి నిర్ణయం తీసుకొని దేవాదాయ కమిషనర్‌కు నివేదిస్తామని ఈవో రామకృష్ణారావు తెలిపారు. కొండపై భక్తులకు వసతి తదితర కనీస వసతులు కల్పించకుండా ఆదాయం పెంచుకొనేందుకు పార్కింగ్ రుసుములు పెట్టడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



కొండపైన భక్తులు నిలిపిన వాహనాలు

తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 25: తల్లి మందలించిందని కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కేశాపూర్‌లో చోటు చేసుకుంది. కేశాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ రాకేష్(16) అనే యువకుడు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాకేష్ ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రాకేష్ కొన్ని రోజులుగా కళాశాలకు వెళ్లకుండా చెడు తిరుగుళ్లు తిరుగుతున్నాడు. తండ్రి గల్ఫ్ వెళ్లి కష్టపడుతుంటే రాకేష్ చదువుకోకుండా తిరగడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి లోనై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి హుటాహుటిన మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. తల్లి గంగాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

మంత్రాల పేరుతో మోసం చేసిన వారిపై కేసు

వీణవంక, ఆగస్టు 25: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి శని పట్టిందని శని దోషం పోవాలంటే తమకు తొమ్మిది వేలు ఇవ్వాలని తాయత్తుల పేరిట తమను మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన బాలరాజు, గుండం రాజు, సైత్యం చందులు గ్రామాల్లో తిరుగుతూ తాయత్తులు కడుతూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. హిమ్మత్‌నగర్‌లో శ్రీనివాస్‌రెడ్డి ఇంటికి వెళ్లి మీకు దోషం ఉందని శనిదోషం పోవాలంటే పూజలు చేస్తామని లేదంటే ప్రాణాలు పోతాయని బెదిరించి తన వద్ద బలవంతంగా తొమ్మిది వేలు తీసుకున్నారు. మరో ఇద్దరి దగ్గర పదకొండు వేలు తీసుకున్నారని ఫిర్యాదు రావడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కథలాపూర్, ఆగస్టు 25 : కొంతకాలంగా మతిస్థిమితం లేక తిరుగుతున్న మారెల్లి బాస్కర్ (30) అనే యువకుడు శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. బాస్కర్ అనే యువకుడు కొన్నేళ్లుగా మతిస్థిమితం లేక తిరుగుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. బాస్కర్ స్వయంగా అంబులెన్స్‌కు ఫోన్‌చేసి చెప్పగా కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ బాస్కర్ మృతి చెందాడు. మేనమామ నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్, ఆగస్టు 25 : మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ కుమార్(36) అనే యువకుడు మద్యానికి బానిసై ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గత 20 రోజుల క్రితం కొయ్యడ కుమార్ మద్యం తాగి వచ్చి ఇంట్లో భార్య రజితతో గొడవపడటంతో పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు 108 ద్వారా పెద్దపల్లికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

● పొత్కపల్లి, బిజిగిరి షరీఫ్ రైల్వే లైన్ల మధ్య మృతదేహం లభ్యం

ఓదెల, ఆగస్టు 25 : మండలంలోని పొత్కపల్లి, బిజిగిరి షరీఫ్ రైల్వే లైన్ల మధ్య ఉన్న 315/36-38 కి.మీ. స్తంభాల వద్ద ఆదివారం గుర్తు తెలియని యువకుడు (35-40ఏళ్లు) రైల్వే పట్టాల మధ్య మృతిచెంది ఉన్నాడు. ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ఇతర కారణాలవల్ల మృతిచెంది ఉండవచ్చని జీఆర్‌పీ అధికారులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇతని ఒంటిపై పూల నలుపు రంగు చొక్కా, స్కై బ్లూ జీన్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. అలాగే మృతుని కుడి చేతిపై బలదేయు అనే పచ్చబొట్టు ఉంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. హత్యానా? లేక ఆత్మహత్య అనే విషయం జీఆర్‌పీ అధికారుల విచారణ అనంతరం బయటపడే అవకాశాలున్నాయి. మంచిర్యాల రైల్వే ఎస్సై సుధాకర్ ఆదేశం మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జి. ఆర్.పి.హెడ్‌కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే ఫోన్ నెం. 8712658596కు సమాచారం అందించాలని హెడ్‌కానిస్టేబుల్ కోరారు.

బీసీ కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

● 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి ● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్షహన్మండ్లు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25: అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి బీసీ కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మండ్లు డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీసీ భవనంలో బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పించి కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్ష హన్మండ్లు మాట్లాడారు. గత ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం బీసీ కుల గణన చేసి, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీపీ మండల్ కమిషన్ చేసిన సిఫారస్, కృషితో విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు రిజర్వేషన్లు వర్తిస్తున్నాయని అన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లను 27 శాతం నుండి 60 శాతానికి పెంచాల్సి ఉండగా పాలకులు 18 శాతానికి తగ్గించారని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో బీసీల కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ప్రకటించిందన్నారు. బీసీ కుల గణన చేపట్టకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం ఆలోచనను విరమించుకోవాలని అన్నారు. బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ కుల గణన చేసి బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తామని ప్రకటిస్తే మరోవైపు ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతుందన్నారు. బీసీ కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం వెళ్లాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు అందినప్పుడే బీపీ మండల్‌కు అసలైన నివాళి దక్కుతుందన్నారు. బీపీ మండల్ స్ఫూర్తితో పోరాటాలకు బీసీలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చీకోటి మల్లేష్‌యాదవ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడుక కమలాకర్, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, నాయకులు కందుకూరి రామాగౌడ్, ప్రసాద్, శ్రీకాంత్, విజయ్, శ్రీనివాస్, రాజు, కైలాష్, గణేష్ పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న రాష్ట్ర అధికార ప్రతినిధి పర్షహన్మండ్లు

వాలీబాల్ జాతీయ క్రీడాకారులను గౌరవించుకోవాలి

● ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుకిషన్‌రావు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 25 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జాతీయ వాలీబాల్ క్రీడాకారులను జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించుకొని గౌరవించుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎన్నికల అధికారి సిహెచ్ వేణుకిషన్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియం ఆవరణలో రాజన్న సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి చింతకింది శ్యాంకుమార్ అధ్యక్షతన జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. 2020 నుండి 2024 వరకు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలు, జిల్లా, ఉమ్మడి జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్లపై సహాయ కార్యదర్శి శ్యాంకుమార్ నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎన్నికల అధికారి వేణుకిషన్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలను నిర్వహించారు. సభ్యులు జిల్లా అసోసియేషన్ కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చెన్నమనేని శ్రీకుమార్, ఉపాధ్యక్షులుగా జి లక్ష్మీనారాయణ, వై ప్రసాద్‌రావు, చింతకింది శ్యాంకుమార్, యెల్లంది వేణు, జి మహేష్, ఎండీ రఫీ, కోల శ్రీనివాస్, జె వెంకటేశ్వర్‌రావు, నంప స్వామి, ప్రధాన కార్యదర్శిగా అజ్మీరా రాందాస్, కోశాధికారిగా కోడం శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా పీ రాంచంద్రంగౌడ్, సాన బాబు, సిహెచ్ రాజశేఖర్, మాదాసు లక్ష్మణ్, షేక్ గౌస్, జె అజిత్‌రావు, బావురెడ్డి, బోయిని రవి, ఏ మాధవరెడ్డి, ఎస్ కార్తిక్, కార్యవర్గ సభ్యులుగా అనిల్ గౌడ్, ప్రభాకర్, శ్రీనివాస్, బాలేష్, దేవయ్య, వేణు, లతీఫ్, స్వామి, అజీమ్, లాలుగౌడ్, శ్రీనివాస్, స్వామి, రాహుల్, రాజుకుమార్, కె భాస్కర్, వెంకట రామస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వేణుకిషన్ మాట్లాడుతూ వాలీబాల్ అసోసియేషన్ ఒక కుటుంబంలా కలిసి కట్టుగా వాలీబాల్ క్రీడాభివృద్ధికి కృషి చేయాలన్నారు. 15 సంవత్సరాల కాలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఎంపిక కావడంలో ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు సన్మానించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా నూతన కార్యవర్గం సభ్యులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు, ఎన్నికల అధికారి, అబ్జర్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ ఎన్నికల అబ్జర్వర్ ఎన్ శ్రీధర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, దేవత ప్రభాకర్, గుడ్ల రవి, కోచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వేణుకిషన్‌రావు



సిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తంగళ్లపల్లి, ఆగస్టు 25: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన కూరగాయల విక్రయదారుడు తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామం కేసీఆర్‌నగర్‌కు చెందిన గోవింద్ సదానందం(38) చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కేసీఆర్ నగర్‌కు చెందిన సదానందం గతంలో పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్న క్రమంలో ఆనారోగ్యానికి గురయ్యాడు. సుమారు మూడు లక్షల రూపాయల అప్పు చేసి చికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి సిరిసిల్ల రైతు బజారులో కూరగాయలు విక్రయిస్తూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించి వచ్చిన సదానందంను భార్య నిలదీయడంతో శనివారం పురుగుల మందు తాగాడు. కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన ట్లు మృతుడి భార్య తెలిపింది. మృతుడికి భార్య భాగ్య, కుతురు, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

● తప్పిన ప్రమాదం



తాటిపల్లి- చల్‌గల్ శివారులో అదుపుతప్పి బోల్తాపడిన కారు

జగిత్యాలరూరల్, ఆగస్టు 25: జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్-తాటిపల్లి శివారులో నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఆదివారం కారు అదుపు తప్పి బోల్తాపడింది. నిజామాబాద్ జిల్లా మెంత్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు జగిత్యాల మీదుగా మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో చల్‌గల్-తాటిపల్లి శివారులో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో కారు పడి ఉంటే ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. వీరిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కొడిమ్యాల, ఆగస్టు 25: మండలంలోని నల్లగొండ గ్రామంలోని తన మనుమరాలి ఇంట్లో నివాసం ఉంటున్న కాసర్ల లచ్చవ్వ(75)ఆదివారం జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లి మండలం గుట్టలపల్లికి గ్రామానికి చెందిన కాసర్ల లచ్చవ్వ ఆమె మనుమడు కాసర్ల సురేష్ నల్లగొండలోని లెంకల యమున ఇంట్లో నివసిస్తున్నారు. యమునా సోదరుడు సురేష్‌ను ఏదో ఒక పని చేసుకోవాలని, ఖాళీగా ఉండకూడదని అనడంతో ఆ విషయాన్ని మనస్సులో పెట్టుకొని యమున నానమ్మ అయిన లచ్చవ్వను మనుమడు సురేష్ కర్రతో కొట్టాడు. దీంతో వృద్ధురాలి చేతికి, తలకు గాయాలయ్యాయి. వృద్ధురాలిని చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతురాలి మనుమరాలు యమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యమ ధర్మరాజు ఆలయంలో భరణి నక్షత్ర పూజలు

ధర్మపురి, ఆగస్టు 25: ధర్మపురి లక్ష్మీ నరసింహా స్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో ఆదివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణాల మధ్య అర్చకులు నేరెళ్ల సంతోష్‌కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్ స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం, నిర్వహించారు. రాత్రి వరకు భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామివారలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు. భరణి నక్షత్రం పురస్కరించుకుని యమధర్మరాజు ఆలయం వద్ద ఆలయం నిర్వహించిన అభిషేకం, ఆయుష్య హోమం కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శనం చేసుకున్నారు. అనంతరం లక్ష్మీ నరసింహాస్వామి వారిని దర్శనం చేసుకున్నారు.

● ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం భక్తుడు సమర్పించిన రెండు 400 లీటర్ల కెపాసిటీ గల వాటర్ కూలర్స్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ పాల్గొన్నారు.



యమ ధర్మరాజు ఆలయంలో పూజలు

'ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలి'

మత్స్యకార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తెం శ్రీనివాస్

సుభాష్‌నగర్, ఆగస్టు 25: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలని కరీంనగర్ జిల్లా మత్స్య కార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉస్తెం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత్స్య కార్మికుల ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. మత్స్య కార్మికుల సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. మత్స్య కార్మికులకు సొసైటీల ద్వారా ఒక్కొక్కరికి రూ.2లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ప్రకటించాలని, మత్స్య కార్మికుల పిల్లలకు ఆత్మీయ పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్య కార్మికులకు ఎలాంటి కిస్తీ లేకుండా సొసైటీలు ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన మత్స్య కార్మికులకు నెలకు రూ.5వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు భూమా సంపత్, ప్రధాన కార్యదర్శి నెల్లి శంకర్, ఉపాధ్యక్షుడు పెసరి శ్రీనివాస్, గుడెల్ల మల్లేశ్, కందుకూరి శ్రీనివాస్, చొక్కయ్య, పిట్ల స్వామి, కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు తునికి వనజ పాల్గొన్నారు.

'ప్రభుత్వ భూములను కాపాడాలి'

సుభాష్‌నగర్, ఆగస్టు 25: రాష్ట్రంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడడం కోసం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ కమిటీ ఏర్పాటు చేసి, కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో బడా వ్యాపారులు, నీసీ పరిశ్రమకు సంబంధించినవారు, బీఆర్ఎస్ నాయకులు విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంచి పెట్టాలని కోరారు. హైదరాబాద్ తరహాలో కరీంనగర్‌లో కూడా హైడ్రా లాంటి ది ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు.

ఆస్తి పంపకాల కోసం అంత్యక్రియలు ఆలస్యం

గంగాధర, ఆగస్టు 25: ఆస్తి కేటాయింపుల కారణంగా గంగాధర మండలం ఆచంపల్లికి చెందిన నరేందర్‌రెడ్డి(26) మృతదేహానికి దహన సంస్కారాలు రెండు రోజులు ఆలస్యంగా నిర్వహించారు. నరేందర్‌రెడ్డి ఈ నెల 21న కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించి చికిత్స అందించగా పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. మృతుడికి 8నెలల కూతురు, భార్యకు ఆధారం చూపాలని వారి బంధువులు పట్టుబట్టారు. పంచాయితీ ఎటూ తేలకపోవడంతో శనివారం పోస్టుమార్టం తీసుకెళ్లిన నరేందర్‌రెడ్డి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని ఫ్రీజర్‌లో పెట్టారు. ఇరు కుటుంబ సభ్యుల ఒప్పందం కుదరగా ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి ఆచంపల్లిలో దహన సంస్కారాలు నిర్వహించారు.

డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసిన కాంగ్రెస్

- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



నిరసన దీక్ష చేస్తున్న పుట్ట మధు



బీపీ మండల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

మంథని, ఆగస్టు 25: ఎన్నికల సమయంలో బీసీల ఓట్లుతో అధికారం కోసం బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసంచేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పుట్ట మధు రాష్ట్రంలో బీసీ డిక్లరేషన్ అమలుచేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు బీసీ డిక్లరేసన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఎక్కడ అమలు చేయాల్సి వస్తుందనని కోర్టు బూచి చూపి తప్పించుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇంత పెద్ద బీసీ సమాజాన్ని కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్నారు. బీసీలకు రాజకీయ అవకాశాలు రాకపోవటానికి కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలే అన్నారు. ఎన్నికల ముందు ఒకమాట, ఎన్నికల తర్వాత ఒక మాట మాట్లాడి కాంగ్రెస్ పార్టీ బీసీలను మభ్య పెడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను గుర్తించి బీసీలంతా ఐక్యమై మహనీయులు స్పూర్తితో బీసీ డిక్లరేషన్ అమలు కోసం పోరాడాలన్నారు. అప్పటివరకు కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, బత్తుల సత్యనారాయణ, సెగ్గెం రాజేష్, మాచీడి రాజుగౌడ్, బెల్లకొండ ప్రకాష్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్‌కుమార్, అడిచర్ల సమ్మయ్య, కుమార్, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ పోరాట యోధుడు బీపీ మండల్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 25: బీసీల ఆరాధ్యుడు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ జయంతి సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆదివారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి తాడూరు శ్రీమన్నారాయణతోపాటు కోఆర్డినేటర్ స్వామివివేక్ పటేల్, రాజేందర్ నాగులమల్యాల రాజమౌళి, నాగులమల్యాల రాజు, కిషోర్, కొప్పుల మల్లయ్య, సదానందం, క్రాంతి, గొల్లపల్లి శంకర్, నరసయ్య, చంద్రబాబు, చందర్ కాజా, మహేశ్వర్, అరుణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్ విగ్రహాలు ఏర్పాటు చేయాలి

దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీపీ మండల్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, యువత విభాగం జిల్లా అధ్యక్షుడు అట్ల సాగర్ యాదవ్ డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీపీ మండల్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదవ నాయకులు మల్లెత్తుల నాగరాజు, సలేంద్ర రాములు, దాడి చంద్రమొగిలి, బత్తుల లింగయ్య, వేల్పుల చంద్రకుమార్, రేషవేన సురేష్, చెలుకల వెంకటేష్, నర్ల సాయి, వేల్పుల శ్రీనివాస్, పోలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 25: ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవానికి అందేలా చర్యలు తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పంచాయతీరాజ్ కార్యదర్శులకు సూచించారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అంతర్గాం, పాలకుర్తి మండలాల పంచాయతీరాజ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి మంచినీటిని అందించాలని, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలను తెలుసుకుని, ఆ సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. పాలకుర్తి మండలంలో ఇటీవల రూ.2కోట్లు పాఠశాలల అభివృద్ధికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి గ్రామం సమస్యలను గుర్తించాలని, వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటాలని, వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్, దోమల మందును చల్లాలని సూచించారు. అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని 35 గ్రామాల్లో ఏయే సమస్యలు ఉన్నాయో రాతపూర్వకంగా తనకు అందజేయాలని సూచించారు. యువత కోసం ప్రతి గ్రామంలో క్రీడాప్రాంగణాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు, సింగరేణి సహకారంతో సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు, ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందేలా కార్యదర్శులు చూడాలని సూచించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

శిథిలావస్థలో వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల



అర్ధంతరంగా నిలిచిపోయిన డైనింగ్ హాల్ నిర్మాణం

జూలపల్లి, ఆగస్టు 25 : మండలంలోని వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారయ్యింది. గత ప్రభుత్వం హయాంలో విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు మనఊరు మనబడి పథకం ద్వారా లక్షలాది రూపాయలు మంజూరుచేసింది. పనుల కాంట్రాక్టు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పాఠశాలలోని కొన్ని గదుల్లో కిటికీలకు అరకొర మరమ్మతులతో పాటు డైనింగ్ హాల్ నిర్మాణ పనులను చేపట్టాడు. పనులను పూర్తి చేయకుండానే అర్ధంతరంగా నిలిపివేసి చేతులు దులుపుకోవడంతో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు ముందుకు సాగక ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇటీవలకాలంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట 2లక్షల రూపాయల పైచిలుకు నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో మహిళా సంఘాల ప్రతినిధులు పాఠశాల గదుల్లో కిటికీల మరమ్మతు పనులు, టాయిలెట్స్ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి నిధులను ఉపయోగించలేక పోయారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఉన్నత పాఠశాల పాత భవనం గోడలు పగుళ్లతో బీటలువారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదభరితంగా మారింది. అందులోనే ప్రధానోపాధ్యాయుడి ఆఫీసుతోపాటు ఉపాధ్యాయుల స్టాఫ్‌రూంకు గాను ఉపయోగించుకుంటుండగా, అందులో ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు ఉపయోగించే టాయిలెట్ పైన రేకులు పగిలిపోయి అధ్వానంగా మారి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం అప్పటి జిల్లా కలెక్టర్ సంగీతసత్యనారాయణ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ పరిశీలించారు. మనఊరు మనబడి పథకంలో విద్యార్థులకు అవసరమైన నూతన గదులు, పాఠశాలకు విద్యార్థులకు రక్షణగా కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు టాయిలెట్స్, తాగునీరు పలు సౌకర్యాలను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల అభివృద్ధి విషయంపై కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించినప్పటికి పనులు ముందుకు సాగలేదని విమర్శలు వస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజల సమస్యలను దృష్టికి తీసుకురావాలి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 25: ప్రతి డివిజన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకొని తన దృష్టికి తీసుకురావాలని రామగుండం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం పేదవారికి అందేలా చూడాలని సూచించారు. రామగుండం నియోజకవర్గంలో జరిగే అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని, రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిచేస్తామని తెలిపారు. ప్రతి డివిజన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకొని తన దృష్టికి తీసుకురావాలన్నారు. అభివృద్ధిని చూడలేక ప్రజలను ఇతర పార్టీనాయకులు తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వమని, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకన్నా ముందు ఉండే దిశలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. ప్రతి డివిజన్‌లో ఉన్న సమస్యను తెలుసుకొని అధికారులు దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే కార్యక్రమం చేస్తామన్నారు. దీంతో పాటు ప్రతి డివిజన్ ప్రెసిడెంట్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొ రేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, హాజరైన నాయకులు, కార్యకర్తలు

‘హామీల అమలులో కాంగ్రెస్ విఫలం’

భగత్‌నగర్, ఆగస్టు 25: హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ జోన్ ఇన్‌చార్జి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజా విశ్వాసం కోల్పోయాయని ఆయన అన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి బీఆర్ఎస్ బంగారు తెలంగాణ, నేటి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రజల్లో అట్టర్ ప్లాప్ అయ్యాయన్నారు. దేశం కోసం పనిచేసే ఏకైకపార్టీ బీజేపీ మాత్రమే అన్నారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా బీజేపీకి గుర్తింపు ఉందన్నారు. పోలింగ్ బూత్ స్థాయి నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృంగా చేపట్టాలన్నారు. సభ్యత్వ నమోదుతో పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు.వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తా మని ప్రజలను రైతులను మోసం చేసిందన్నారు. రేకుర్తిలోని మహా లక్ష్మి గార్డెన్స్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, మాజీ మేయర్ డి శంకర్, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, మాడ వెంకట్‌రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కొరటాల శివ రామయ్య, నాగేశ్వర్ రెడ్డి, గుగ్గిల్లపు రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీనారాయణ, బోయినపల్లి ప్రవీణ్‌రావు, జాడిబాల్‌రెడ్డి, కన్న కృష్ణ, కార్పొరేటర్లు బండసుమ, చొప్పరి జయశ్రీ, కొలగాని శ్రీనివాస్,పవన్, శ్రీనివాస్, జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

‘ప్రగతి’లో కృష్ణాష్టమి వేడుకలు

ఎలిగేడు, ఆగస్టు 25 : మండలంలోని సుల్తాన్‌పూర్‌లోని ప్రగతి టెక్నో స్కూల్‌లో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ మండిగ రేణుకరాజనర్సు, ఎంపీపీ తానపర్తి స్రవంతిమోహన్‌రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీ వైస్‌ఎంపీపీ బుర్ర వీరస్వామిగౌడ్, ఎంఆర్‌పీఎస్ డివిజన్ అధ్యక్షుడు కవ్వంపల్లి బాపయ్య, కరస్పాండెంట్ గర్రెపల్లి సురేందర్, ప్రిన్సిపాల్ గర్రెపల్లి కావ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుడికి సన్మానం

పాలకుర్తి,ఆగస్టు 25: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి కాలినడకన హజ్‌యాత్రకు బయలుదేరిన మొహమ్మద్ ఆబిద్‌ను బసంత్‌నగర్‌లో ఆదివారం డీసీసీ మైనారిటీ విభాగం ప్రధానకార్యదర్శి మొహమ్మద్ ఇబ్రహీం సన్మానించారు. కాంగ్రెస్ కార్మిక శాఖ మండల అధ్యక్షుడు మొహమ్మద్ ఫయాజ్, సలీం, ఇంతియాజ్, గఫ్పార్, మొహ్మద్ షఫి, మొహమ్మద్ ఖలీల్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : కాలినడకన హజ్‌యాత్రకు వెళ్తున్న అబ్దుల్ అబిద్‌ను ఆదివారం కాలనీ మజీద్ కమిటీ సభ్యులు సన్మానించారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుల నియామకం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 25: బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా మంథని నియోజక వర్గానికి చెందిన పూసాల రాజేంద్రప్రసాద్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. ఈమేరకు ఆదివారం రాజేంద్రప్రసాద్‌కు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

కళ్యాణ్‌నగర్ : బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రామగుండానికి చెందిన బోడకుంట సుభాష్‌ను నియమిస్తూ ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ నియామక ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తానని, ఓబీసీ మోర్చాను బలోపేతం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

పీఆర్‌టీయూ కార్యవర్గం

జూలపల్లి, ఆగస్టు 25 : మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం పీఆర్‌టీయూ మండల శాఖ సర్వసభ్య సమావేశం ముత్యంరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్ హాజరయ్యారు. పీఆర్‌టీయూ మండల నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా పెంచాల ముత్యంరావు, ప్రధానకార్యదర్శి బొల్లం ప్రవీన్, సహ అధ్యక్షులుగా నరసింహస్వామి, మహిళా ఉపాధ్యక్షులుగా పోతునూరి సునిత, కార్యదర్శిగా కుమారస్వామిలను నియమించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రియుడు ఇంటి ఎదుట బైఠాయింపు

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 25: మండలంలోని పెద్దంపేటలో ఆదివారం ప్రియుడి ఇంటి ముందు ఓ యువతి బైఠాయించింది. గ్రామానికి చెందిన బాధితురాలు పోలు దాసరి సౌమ్య(21) అదే గ్రామానికి చెందిన జక్కుల శివకుమార్(26) నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చి ఇప్పుడు ఇంట్లో వాళ్లు ఒప్పుకోవడం లేదని చెబుతున్నాడంటూ శివ కుమార్ ఇంటిముందు సౌమ్య ఆందోళనకు దిగింది. దీంతో శివకుమార్‌తో పాటు అతని తల్లిదండ్రులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న అక్కడికి చేరుకొని పోలీసులు సౌమ్యను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఎన్‌సీపీలోకి యువకుల చేరిక

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 25: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ)లో పలువురు యువకులు చేరారు. ఆదివారం గోదావరిఖనిలోని తెలంగాణ కేంద్ర కార్యాలయంలో పార్టీ చేరిక కార్యక్రమం నిర్వహించారు. చెన్నూరి నాగరాజు ఆధ్వర్యంలో రామగుండం 46వ డివిజన్ కాకతీయనగర్‌కు చెందిన యువకులు చేరగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోలివాడ ప్రసన్నకుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, అక్షయ్, మనోజ్, కౌశిక్, యాసుఫ్, వసిత్, రమేష్, సంజయ్ పాల్గొన్నారు.

రుణమాఫీ పూర్తిచేయాలి

ఓదెల, ఆగస్టు 25 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు బడ్జెట్లో కేటాయించిన రూ.31వేల కోట్లను పంపిణీ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కోడం స్వామి అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ లెక్కప్రకారంగా రూ.49,500కోట్లు అని కేబినేట్‌లో చెప్పిందని, అనంతరం కేవలం 31వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించిందని తెలిపారు. మూడు విడతల రూ.26వేల కోట్లు కలిపి రైతులకు ఇచ్చిందని, కానీ ఒకే విడతలో రూ.17933 కోట్లు రైతులకు రుణమాఫీ అయిందని తెలిపారు. తొలత రూ.40వేల కోట్లతో మాఫీ అంచనాలు వేసి ఇప్పుడు కేవలం రూ.27వేల కోట్లకు పరిమితం చేయడం ఏమిటని అన్నారు. మూడు విడతల్లో రుణమాఫీ అమలు చేసినప్పటికీ మండలాల్లో ఇంకా రుణమాఫీ కానీ రైతులు మిగిలిపోయారని, మరో కొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నందున రుణమాఫీని అటకెక్కించే పరిస్థితి ఉందని, స్థానిక ఎన్నికల లోపు రుణమాఫీని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్ రూరల్, ఆగష్టు25: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో 2008-09 సంవత్సరం జిల్లా పరిషత్ స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆనాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులైన చొక్కారెడ్డి, ముకుందం, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, మునీర్‌ఖాన్, మమతారెడ్డి, సునీత, మధుసూధన్ శర్మలను శాలువాలతో సత్కరించారు. చిన్ననాటి జ్ఞాపకాలను, స్కూల్‌లో చేసిన చిలిపి పనులను ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తోటి విద్యార్థులతో ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

భగత్‌నగర్, ఆగస్టు 25: దేశ ప్రధాని నరేంద్రమోడీ మన్‌కీ బాత్‌కార్యక్రమాన్ని 59వ డివిన్‌లో 164 బూత్ అధ్యక్షురాలు దయ్యాల వరలక్ష్మి ఆధ్వర్యంలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, ఎడమ సత్యనారాయణరెడ్డి, రెడ్డెడ్డి శ్రీనివాస్, మామిడి చైతన్య, పబ్బల్ల ఆంజనేయులు, దయ్యాల కరుణాకర్, ఒజ్జెం సంజీవ్‌కుమార్, దయ్యాల అశోక్‌కుమార్, మామిడి రమేష్, డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 25: మహబూబ్‌నగర్‌లో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న ఐదవ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలకు కరీంనగర్ పారమితకు చెందిన ఎస్.అశ్విక ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంతరావు తెలిపారు.

పీవోడబ్ల్యూ మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న పీవోడబ్ల్యూ నాయకురాళ్లు

జ్యోతినగర్, ఆగస్టు 25 : హైదరాబాద్‌లో సెప్టెంబరు 1, 2 తేదీల్లో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.జ్యోతి కోరారు. ఆదివారం ఎన్టీపీసీలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ పితృస్వామ్య ఆధిపత్యాన్ని మహిళలు ధిక్కరించాలని, మనువాద భావజాలానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో, దేశంలో మహిళలపై లైంగిక దాడులు, హింస, హత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయని ఆ వేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో ఇప్పటికీ మహిళలు వివక్షతకు గురవుతున్నారని, వీటికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమాలు చేయాలన్నారు. ఈ విషయంలో 1,2లలో జరిగే మహాసభలో చర్చించి భవిష్యత్ ఉద్యమకార్యాచరణను ప్రకటిస్తారన్నారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, పీవోడబ్ల్యు నాయకురాళ్లు సరోజన, కవిత, కనకలక్ష్మి, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

‘పొన్నం రామలింగంగౌడ్ సేవలు మరువలేనివి’

పాలకుర్తి, ఆగస్టు 25: ఉమ్మడి రామగుండం మండల మాజీ జడ్పీటీసీ పొన్నం రామలింగంగౌడ్ సేవలు మరువలేనివని రామలింగం ఫౌండేషన్ సభ్యులు పొన్నం సంతోష్ గౌడ్, పొన్నం సతీష్‌గౌడ్‌లు అన్నారు. ఇటీవల మృతిచెందిన గ్రామానికి చెందిన నిరుపేద వొడ్నాల ప్రభుదాస్ కూతురు అక్షితకు 2 సంవత్సరాల స్కూల్ ఫీజు రామలింగం ఫౌండేషన్ ద్వారా చెల్లించి తండ్రి ఆశయాలను కొడుకులు నెరవేర్చారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాస్, కేశ శంకర్, ముల్కల్ల కొమురయ్య, వొడ్నాల కిషన్, గన్నెవరపు సాయి, సంకరి కుమార్, పొన్నం సాయితిరుమల్, మంత్రి అవినాష్, పెయ్యావుల శ్రీనాథ్, జేమ్స్, మోడల్‌స్కూల్ కరస్పాండెంట్ మహేష్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కమాన్‌పూర్, ఆగస్టు 25: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గోదావరిఖని టూటౌన్ సీఐ ఎం.ప్రసాదరావు, ఎస్‌ఐ కోట్టే ప్రసాద్ అన్నారు. మండలంలోని రొంపికుంట గ్రామంలో శనివారం రాత్రి పోలీస్ కళా బృందంచే కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూఢ నమ్మకాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కటకం రవీందర్, కమ్మగోని మల్లయ్య, చిందం తిరుపతితో పాటు సిబ్బంది వెంగళ శ్రీనివాస్ ఉన్నారు.

నిరుపయోగంగా దోబీ ఘాట్లు

-కనీస వసతులు కల్పించాలని రజకుల వినతి



గుడిపెల్లిలో నిరుపయోగంగా ఉన్న దోబీఘాట్లు

పాలకుర్తి, ఆగస్టు 25: మండలం పరిధిలోని పలు గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన దోబీ ఘాట్లు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2005, 2006లో బీసీ వెల్ఫేర్ నిధులు 2 లక్షల వ్యయంతో మండలం పరిధిలోని పలు గ్రామాల్లో ఆగమేఘాల మీద దోబీఘాట్లను నిర్మించారు. అక్కడ ఎలాంటి నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకుండానే నిర్మించి అట్టహాసంగా ప్రారంభించారు. గుడిపెల్లి గ్రామంలో 2015,2016 లో బీసీ వెల్ఫేర్ నిధులు 4లక్షల 50 వేల రూపాయల వ్యయంతో అప్పటి రామగుండం ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ పనులను ప్రారంభించారు. కానీ గుత్తేదారు అక్కడ బోరుమోటర్, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా మరాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు దోబీ ఘాట్లలో కనీస వసతులు కల్పించి వాడుకలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మండలంలో విజృంభిస్తున్న జ్వరాలు

జూలపల్లి, ఆగస్టు 25: కొద్ది రోజులుగా జూలపల్లి మండలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లోని మురికి నీటి కాలువలు, పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించలేక పోవడంతో దోమలు పెరిగి వ్యాధులు ప్రబలుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని కాలనీల్లో తరచుగా ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు పెరిగి విషజ్వరాలు ప్రబలుతున్నాయని పలువురు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో సక్రమంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై అక్రమ కేసులు పెడుతున్నారు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 25: తమపైపై అధికారులు అక్రమంగా కేసులు పెడుతున్నారని, ఆదుకోవాలంటూ ఆదివారం పాలకుర్తి మండలానికి చెందిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు ఆదివారం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తమపై తెలంగాణ వైద్య మండలి ఇటీవల దాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారని, తాము ప్రాథమిక చికిత్సను మాత్రమే అందిస్తున్నామని ఎమ్మెల్యేకు చెప్పారు. దీనిపై డీఎంహెచ్‌ఓతో మాట్లాడి ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం



కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 25: పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా ఆదివారం పెద్దపల్లి ప్రభుత్వ హాస్పిటల్‌లోని రక్త నిల్వ కేంద్రంలో రక్తదానం చేపట్టారు. బొంపల్లికి చెందిన మాజీ వార్డు మెంబర్, ముత్యాల సాగర్, నెతెట్ల వెంకటేష్, రాజుతో పాటు మరికొంతమంది అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం జెండా చౌరస్తాలో భారీ కేక్‌ను కట్ చేసి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్ఫూర్తి మానసిక వికలాంగుల పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్రెడ్లు, పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో కొలిపాక రాము, సంతు నది, ధర్మయ్య, తిరుపతి, శంకర్ దేవి, నక్క రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.